సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 1 । ఫిబ్రవరి । 2024



అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలి

శ్రీకాకుళంలో బుధవారం ఆడుదాం–ఆంధ్రా జిల్లా స్థాయి పోటీలు ప్రారంభమయ్యాయి. క్రీడాకారులు విజయమే లక్ష్యంగా పోరాడారు. - 8లో



కారు ఢీకొని వ్యక్తి మృతి

పెద్దబాణాపురం సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మరొకరు గాయపడ్డారు. - 8లో

నేటితో జేఈఈ మెయిన్స్ పరీక్షలు పూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ విద్యాసంస్థల్లో ఇంజినీరింగ్ ప్రవేశాలకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తున్న జేఈఈ ఆన్‌లైన్ మెయిన్స్ పరీక్షలు గురువారంతో ముగియనున్నాయి. ఈ నెల 27 నుంచి జిల్లాలోని ఎచ్చెర్ల శ్రీవేంకటేశ్వ ఇంజినీరింగ్ కళాశాల, చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాల కేంద్రాలుగా రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరుగుతున్న సంగతి తెలిసిందే. బుధవారం 400 మందికి గాను 395 మంది పరీక్షకు హాజరయ్యారు.

న్యూస్‌రీల్

జిల్లాకు కొత్త అదనపు ఎస్పీలు



డాక్టర్ ప్రేమ్‌కాజల్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు శాఖకు సంబంధించి కొత్త అదనపు ఎస్పీలు రానున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు వెలువరించారు. కాకినాడ స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో అటాచ్ విశాఖపట్నం కమిషనర్ ఆఫ్ పోలీసు కార్యాలయం నుంచి డాక్టర్ ప్రేమ్ కాజల్ శ్రీకాకుళం అడ్మిన్ విభాగానికి అదనపు ఎస్పీగా రానున్నారు. ఏలూరు ఎస్సీ ఎస్టీ సెల్, ఏసీబీ అదనపు ఎస్పీగా ఉన్న బి.ఉమామహేశ్వరరావు శ్రీకాకుళం క్రైమ్ విభాగానికి అదనపు ఎస్పీగా వస్తున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న అదనపు ఎస్పీలు జె.తిప్పేస్వామి (అడ్మిన్) టి.పి.విఠలేశ్వరరావు (క్రైమ్)లు ఆంధ్రప్రదేశ్ పోలీస్ అకాడమీ, ఏసీబీ అదనపు ఎస్పీలుగా బదిలీపై వెళ్లిపోతున్నారు.

ఈవీఎం గోదాముల తనిఖీ



గోదాములను తనిఖీ చేస్తున్న కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాములను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ బుధవారం తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఈవీఎంలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం జిల్లాలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో భద్రతా చర్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ బి.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఆ మెడికల్ సర్టిఫికెట్ నకిలీదే..

శ్రీకాకుళం: జిల్లాలోని డ్వామాలో పనిచేస్తూ ఏడాది కాలంగా సెలవులో ఉన్న ఉద్యోగి సమర్పించిన మెడికల్ సర్టిఫికెట్ నకిలీదేనని రిమ్స్ వైద్యుల బృందం తేల్చిచెప్పింది. ఫోర్జరీ సంతకాలతో మెడికల్ సర్టిఫికెట్లు పేరిట 'సాక్షి'లో ఇటీవల కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా సదరు ఉద్యోగి సమర్పించిన మెడికల్ సర్టిఫికెట్ అసలుదో, నకిలీదో తేల్చాలని డ్వామా అధికారులు రిమ్స్‌కు పంపించారు. విచారణకు ఇద్దరు వైద్యుల బృందం డాక్టర్ ఎల్.ప్రసన్నకుమార్, డాక్టర్ కె.సునీల్‌నాయక్‌లను నియమించారు. సర్టిఫికెట్ సమర్పించిన ఉద్యోగిని పిలిపించి విచారించగా డే అండ్ నైట్ జంక్షన్‌లోని ఓ ప్రైవేట్ మధ్యవర్తి ద్వారా ధ్రువపత్రం పొందాను తప్ప వైద్యుడిని కలవలేదని అంగీకరించాడు. కాగా, సర్టిఫికెట్ జారీ చేసినట్లు పేర్కొన్న వైద్యుడు 15 ఏళ్ల క్రితమే బదిలీ అయ్యారని, సర్టిఫికెట్‌లో ఉన్న జాబ్ రిజిస్టర్ నంబర్ కూడా ఆయనది కాదని బృందం నివేదికలో పేర్కొన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే, డే అండ్ నైట్ జంక్షన్‌లో ఎవరు ఇటువంటి సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారో వెలుగులోకి వస్తుందని విచారణ అధికారులు 'సాక్షి'తో పేర్కొన్నారు.

ఓటర్ల జాబితా సవరణకు 10,304 దరఖాస్తులు



మాట్లాడుతున్న డీఆర్వో గణపతిరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటర్ల జాబితాలో పేరు, చిరునామా తదితర సవరణల కోసం ఇప్పటివరకు 10,304 దరఖాస్తులు వచ్చాయని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితా (ఎస్ఎస్ఆర్–2024)లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. తాజాగా వచ్చిన ఫారం 6, 7, 8లను పరిశీలించి సప్లిమెంటరీ ఓటరు జాబితాలో చేరుస్తామన్నారు. కొత్తగా ఓటు నమోదు కోసం గత వారం 1583 మంది సంప్రదించారని పేర్కొన్నారు. డిసెంబర్ 12 నుంచి ఇప్పటి వరకూ 12,267 మంది కొత్త ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. చిరునామా, పేరు, ఇతర సవరణలు కోరుతూ 10,304 మంది దరఖాస్తు చేసుకోగా అందులో 454 తిరస్కరించామని, 4424 పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు రౌతు శంకరరావు, కె.వి.రామరాజు, దేసెళ్ల మల్లిబాబు, సోమేశ్వరరావు, సురేష్‌బాబు సింగ్, సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

పల్లెకు కాసుల కళ

- 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.36.42 కోట్లు విడుదల
- మరో రెండు నెలల్లో రూ.65 కోట్లు జమ చేసే అవకాశం
- గ్రామాల్లో కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు చాన్స్
- గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల ఆధారంగా పనులు



అరసవల్లి :

పంచాయతీలకు ఆర్థిక దన్ను కల్పించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి నోచుకోని గ్రామాల రూపురేఖలను మార్చేందుకు తాజాగా 15వ ఆర్థిక సంఘ నిధులు విడుదల చేసింది. వీటితో సీసీ రోడ్లు, కాలువలు వంటి పనులు చేపట్టనుంది. గ్రామ పంచాయతీల్లో కొత్త పాలన వచ్చి మూడేళ్లయిన సందర్భంగా జిల్లాలో గ్రామ సర్పంచ్ పాలన ఉన్న పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.36,42,93,801 జమ చేసింది. వీటిని 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన ఆయా పంచాయతీల ఖాతాల్లోకి నేరుగా సబ్‌ట్రెజరీల ద్వారా సర్దుబాటు చేయనుంది. ఈ నిధులతో గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలతో పాటు పారిశుద్ధ్య పనులు, వివిధ రకాల చార్జీల చెల్లింపు, చెత్త నుంచి సంపద ఉత్పత్తి కేంద్రాల నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలు కూడా చెల్లించుకోవచ్చు.

896 పంచాయతీలకు లబ్ధి..

జిల్లాలో మొత్తం 912 గ్రామ పంచాయతీలుండగా, వీటిలో వివిధ కారణాలతో ఎన్నికలు జరగని, కోర్టు కేసులున్న పంచాయతీలు 16 మినహాయించి మిగిలిన 896 గ్రామ పంచాయతీలకు తాజాగా 15వ ఆర్థిక సంఘ నిధులు జమయ్యాయి. 2022–23 ఆర్థిక సంవత్సరం 2వ క్వార్టర్ ద్వారా రూ.36,09,48,786, అలాగే 2022–23 ఆర్థిక సంవత్సరం 1వ క్వార్టర్ (టైడ్, అన్‌టైడ్ ఇంట్రెస్ట్ ఫండ్) ద్వారా రూ.33,45,015 వరకు నిధులు విడుదలయ్యాయి. వచ్చే రెండు నెలల్లో (ఫిబ్రవరి, మార్చి) 2023–24 క్వార్టర్ నిధులు కూడా విడుదల కానున్నాయని జిల్లా పంచాయతీ కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటి వరకు రూ.36.42 కోట్లు నిధులు రాగా, రానున్న రెండు నెలల్లో ఏకంగా మరో రూ.65 కోట్ల వరకు నిధులు నేరుగా పంచాయతీల ఖాతాలకు జమయ్యే అవకాశముందని సమాచారం. దీంతో పంచాయతీల్లో ఇంతవరకు జరగని స్థాయిలో అభివృద్ధి పనులు ఊపందుకోనున్నాయి. మారుమూల ప్రాంతాలు, అనుబంధ గ్రామాలు, కొత్తగా ఏర్పడిన పంచాయతీల్లో ఈ నిధులతో అభివృద్ధి పనులు జరగనున్నాయి.

సక్రమంగా ఖర్చు చేయాలి...



గ్రామ పంచాయతీలకు భారీగా నిధులు రానున్నాయి. తాజాగా 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.36.42 కోట్లు జమయ్యాయి. వీటితో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలు చేపట్టే అవకాశముంది. పారిశుద్ధ్య నిర్వహణకు ఈ నిధులు ఎంతగానో ఉపయుక్తం కానున్నాయి. నిధుల వినియోగంలో అప్రమత్తంగా ఉంటూ సక్రమంగా ఖర్చు చేయాలి. రానున్న రోజుల్లో 15వ ఆర్థిక నిధులు మరిన్ని రానున్నాయని తెలిసింది.

– వి.రవికుమార్, జిల్లా పంచాయతీ అధికారి

గురువుల కొలువుకు వేళాయె!

- డీఎస్సీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- జిల్లాలో భర్తీ కానున్న 712 ఉపాధ్యాయ పోస్టులు
- ఆనందంలో నిరుద్యోగ అభ్యర్థులు



జిల్లాలో మేనేజ్‌మెంట్లవారీగా భర్తీ కానున్న పోస్టులు ఇవే..

మేనేజ్‌మెంట్	ఎస్‌జీటీ	ఎస్ఏ	ఎల్‌పీ	పీఈటీ	మొత్తం
ప్రభుత్వ/జెడ్పీ/ఎంపీపీ	341	106	42	37 (మ్యూజిక్ 1)	527
స్పెషల్ స్కూల్స్	47	13	04	01	65
ట్రైబల్ ఏజెన్సీ	24	03	06	02	35
ట్రైబల్ నాన్ ఏజెన్సీ	39	11	23	12	85
మొత్తం	451	133	75	52	712

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయ పోస్టులకు సన్నద్ధమౌతున్న నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. సుమారు 6100 పోస్టులను డీఎస్సీ–2024 ద్వారా భర్తీ చేసేందుకు ఏపీ క్యాబినెట్ ఆమోదం తెలపగా.. ఇందులో శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి 712 పోస్టులు భర్తీ అయ్యే అవకాశముంది. దీంతో జిల్లాలో నిరుద్యోగ యువతీ యువకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో అన్ని మేనేజ్‌మెంట్ల వారీగా 712 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు అధికారులు సమాయత్తమౌతున్నారు. ఇందులో ప్రభుత్వ/జెడ్పీ/ఎంపీపీ కేటగిరిలో (ఎస్‌జీటీ 341, ఎస్ఏ 42, ఎల్‌పీ 42, పీఈటీ 37, మ్యూజిక్ 1) కలిపి మొత్తం 527 పోస్టులు, స్పెషల్ స్కూల్స్‌లో (ఎస్‌జీటీ 47, ఎస్ఏ 13, ఎల్‌పీ 04, పీఈటీ 01) కలిపి మొత్తం 65 పోస్టులు, ట్రైబల్ ఏజెన్సీ(ఆశ్రమస్కూల్స్)లో (ఎస్‌జీటీ 24, ఎస్ఏ 03, ఎల్‌పీ 06, పీఈటీ 02) కలిపి మొత్తం 35 పోస్టులు, ట్రైబల్(ఆశ్రమ స్కూల్స్) నాన్ ఏజెన్సీలో (ఎస్‌జీటీ 39, ఎస్ఏ 11, ఎల్‌పీ 23, పీఈటీ 12) 85 పోస్టులను భర్తీ చేయనున్నారు.

తొలుత టెట్.. తర్వాతే డీఎస్సీ..

మరికొద్ది రోజుల్లోనే డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. డీఎస్సీకి ముందే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను నిర్వహించేందుకు ఇప్పటికే ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసిన విషయం తెలిసిందే. ఈసారి టెట్‌ను, డీఎస్సీని విడివిడిగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత టెట్ నిర్వహించి, ఆ తర్వాత డీఎస్సీ నిర్వహించనున్నారు. ఈ క్రమంలో టెట్‌కు ఫిబ్రవరి ఒకటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. దరఖాస్తుల సంఖ్య ఆధారంగా పరీక్షల షెడ్యూల్ నిర్ణయిస్తామని సర్కార్ పేర్కొంది. దరఖాస్తులు భారీగా వస్తే పరీక్షల నిర్వహణకు 15 రోజులు పట్టే అవకాశం ఉంది. ఆ తర్వాత 15 రోజులు అటు ఇటుగా డీఎస్సీకి కూడా దరఖాస్తులు స్వీకరించాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. డీఎస్సీలో టెట్ మార్కులకు 20 శాతం వెయిటేజీ ఉంటుందనే సంగతి తెలిసిందే.

సముద్ర తాబేళ్ల మృత్యుఘోష



ఇసుకమేటలో తాబేలు కళేబరం



ఒడ్డుకు కొట్టుకొచ్చిన కళేబరం

- శ్రీకాకుళం రూరల్ ప్రాంత బీచ్‌లలో వందలాది కళేబరాలు
- రక్షణ కల్పించాలంటున్న స్థానికులు

శ్రీకాకుళం రూరల్ : కూర్మనాథుడి ప్రతిరూపంగా భావించే తాబేళ్లు పెద్ద ఎత్తున మృత్యువాతపడుతున్నాయి. శ్రీకాకుళం రూరల్ మండలం పరిధిలోని కుందువానిపేట, పెదగనగళ్లపేట బీచ్ తీరంలో అడుగడుగునా సముద్రతాబేళ్ల మృత కళేబరాలే దర్శనమిస్తున్నాయి. బీచ్ వెంబడి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు, పర్యాటకులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి తాబేళ్ల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని తీర ప్రాంతవాసులు కోరుతున్నారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లకు బదిలీ



శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో పలువురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లకు బదిలీ చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. పార్వతీపురం మన్యం జిల్లా తోటపల్లి భూ సేకరణ విభాగం యూనిట్–3 ఎస్‌డీసీగా పనిచేస్తున్న బి.సుదర్శన దొరను జిల్లాలో కేఆర్ఆర్‌సీ(శ్రీకాకుళం)కు బదిలీ చేశారు. ఇక్కడ పనిచేసిన పి.మురళీకృష్ణను పార్వతీపురం తోటపల్లి బ్యారేజీ భూ సేకరణ విభాగం యూనిట్–3కి బదిలీ చేశారు. ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎం.అప్పారావుని జిల్లాలో ఎఫ్ఎస్‌వోగా నియమించారు. ఈ పోస్టు ఇప్పటి వరకు ఖాళీగా ఉంది. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఎస్‌డీసీ వెంకట సత్యసాయిరాం మోహన్‌ను బీఆర్ఆర్ వంశధార యూనిట్–1కి బదిలీ చేశారు. ఇప్పటి వరకు పనిచేసిన జి.జయదేవిని విశాఖ ఐసీడీఎస్ పీడీగా బదిలీ చేశారు. పాలకొండ ఆర్డీవో ఎం.లావణ్యను జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా నియమించారు. ఈ పోస్టు ఇప్పటి వరకు ఖాళీగా ఉంది. బొబ్బిలి భూ సేకరణ విభాగం ఎస్‌డీసీ బి.వెంకటేశ్వరరావును జిల్లా పరిషత్ సీఈవోగా నియమించారు.

ఎస్‌ఐలకు బదిలీ



శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో పది మంది సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ విశాఖపట్నం రేంజి నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు ఎస్పీ జి.ఆర్.రాధిక బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఎస్‌ఐలు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎస్.లక్ష్మణరావు	శ్రీకాకుళం–2 టౌన్	ఇచ్ఛాపురం రూరల్
గుండపు రాజేష్	జె.ఆర్.పురం	కంచిలి
ఎ.కోటేశ్వరరావు	లావేరు	శ్రీకాకుళం డీఎస్‌బీ
వై.మధుసూదనరావు	వజ్రపుకొత్తూరు	జి.సిగడాం
కె.గోవిందరావు	ఇచ్ఛాపురం టౌన్	జె.ఆర్.పురం
వి.సత్యనారాయణ	ఎచ్చెర్ల	ఇచ్ఛాపురం టౌన్
కె.లక్ష్మి	శ్రీకాకుళం–2 టౌన్	టెక్కలి –1
పి.పారినాయుడు	జలుమూరు	కాశీబుగ్గ –1
సీహెచ్ రామారావు	జి.సిగడాం	వజ్రపుకొత్తూరు
ఎస్.చిరంజీవి	బారువ	ఎచ్చెర్ల
జి.వాసుదేవరావు	విశాఖపట్నం సిటీ	శ్రీకాకుళం రూరల్
కె.వెంకటేషు	శ్రీకాకుళం సీసీఎస్	ఆమదాలవలస
కె.మధుసూదనరావు	సంతబొమ్మాళి	జలుమూరు
వి.వెంకటేశ్వరరావు	శ్రీకాకుళం వీఆర్	టెక్కలి–2
ఎస్‌కె ఖాదర్‌బాషా	పొందూరు	శ్రీకాకుళం డీఎస్‌బీ
డి.విజయ్‌కుమార్	విజయనగరం జిల్లా	శ్రీకాకుళం డీసీఆర్బీ
వి.సందీప్‌కుమార్	శ్రీకాకుళం వీఆర్	శ్రీకాకుళం సీసీఎస్
ఎల్.నాగరాజు	విశాఖపట్నం సిటీ	ఆమదాలవలస
ఎన్.సింహాచలం	విశాఖపట్నం సిటీ	శ్రీకాకుళం ఎస్సీఎస్టీసెల్
జి.శ్యామలరావు	విశాఖపట్నం సిటీ	శ్రీకాకుళం డీపీటీసీ

43 మంది తహసీల్దార్లకు స్థాన చలనం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో తహసీల్దార్లకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 48 మంది తహసీల్దార్లు ఉండగా ఇందులో ఇద్దరికి గతంలోనే బదిలీ అయ్యింది. మిగిలిన 46 మందిలో ముగ్గురు జూన్ 30లోగా ఉద్యోగ విరమణ చేయనుండటంతో బదిలీ నుంచి మినహాయింపు ఇచ్చారు. మిగిలిన 43 మందికి బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీరంతా విజయనగరం, మన్యం అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకు వెళ్తున్నారు. వీరి స్థానంలో ఉమ్మడి విజయనగరం, విశాఖ జిల్లాల నుంచి జిల్లాకు 45 మంది వస్తున్నారు.

ఆనందాల ఆసరా

మహిళల్లో ఆసరా ఆనందం వెల్లివిరుస్తోంది. వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సభలకు లబ్ధిదారులు పోటెత్తుతున్నారు. మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రిగా రావాలంటూ నినదిస్తున్నారు. బుధవారం ఆమదాలవలస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో నిర్వహించిన సంబరాలకు స్పీకర్ తమ్మినేని సీతారాం, జెడ్పీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పిరియా విజయ హాజరై ఆసరా చెక్కులు అందజేశారు. – ఆమదాలవలస/ఇచ్ఛాపురం రూరల్





ఆమదాలవలస ఆసరా సంబరాల్లో పాల్గొన్న మహిళలు (ఇన్‌సెట్లో) చెక్కును అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ

స్వయం సహాయక సంఘాలకు రుణమాఫీ పూర్తిచేసి మహిళా పక్షపాతిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిరస్థానం సంపాదించుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను మహిళలకే కేటాయిస్తూ వారికి తగిన గౌరవాన్ని కల్పించారు. ఇటువంటి నాయకుడ్ని శాశ్వతంగా కొనసాగించాలి.

– తమ్మినేని సీతారాం, ఏపీ అసెంబ్లీ స్పీకర్
(ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన ఆసరా నిధుల విడుదలలో..)

మా కుటుంబానికి 'ఆసరా'



నాకు భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు. గతంలో జీవనం సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నాను. జగనన్న ప్రభుత్వం వచ్చాక కుటుంబానికి ఆసరా కలిగింది. ఆసరా, బ్యాంకు లింకేజీ ద్వారా రూ.2 లక్షలు తీసుకొని సొంతంగా ఇంటి వద్దనే లేడీస్ కార్నర్ పెట్టుకున్నాను. మహిళలకు అవసరమైన అలంకార వస్తువులను అమ్ముకుంటూ రుణాన్ని సులువుగా తీర్చుకుంటున్నాను.

– తులసీ బెహరా, ఇచ్ఛాపురం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

మళ్లీ సీఎంను చేయండి

స్త్రీలకు ఆర్థిక స్వావలంబన కల్పించి మహిళా పక్షపాతినని చాటుకున్నారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. నాలుగు విడతల్లో ఆసరా పథకం కింద నిధులు జమ చేసిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసి ఆయన రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత అక్కచెల్లెమ్మలపై ఉంది.

– పిరియా విజయ, జెడ్పీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి
(వైఎస్సార్ విజయ ప్రస్థానం వద్ద ఇచ్ఛాపురం లబ్ధిదారులకు ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో)

సొంతంగా వ్యాపారం ..



సీఎం జగనన్న మా పాలిట వరంగా మారారు. ఆసరా, బ్యాంకు లింకేజీ ద్వారా లక్ష రూపాయలు రుణం తీసుకొని ఇంటి వద్దనే వ్యాపారం చేయాలనుకున్నాను. అందుకు అన్ని రకాల పచ్చళ్ల తయారీ, చేగోడీలు, చుప్పులు, జంతికలు వంటి తిను బండారాలను తయారు చేసుకొని వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటూ నా కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. థ్యాంక్యూ జగనన్న.

– తంగుడు స్వర్ణలత, ఇచ్ఛాపురం

అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలి

- ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి పోటీలు ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో, రాష్ట్రంలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను అంతర్జాతీయస్థాయి క్రీడాకారులుగా తయారు చేయడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర పోటీల్లో భాగంగా బుధవారం నాలుగో దశగా జిల్లాస్థాయి పోటీలు మొదలయ్యాయి. జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియంలో జరుగుతున్న ఈ పోటీలను జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి కృష్ణదాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందన్నారు. జేసీ నవీన్ మాట్లాడుతూ మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలనే లక్ష్యంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డీఎస్‌డీవో డాక్టర్ కె.శ్రీధర్‌రావు మాట్లాడుతూ జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన సచివాలయం జట్లు నాలుగు రోజులపాటు జిల్లా కేంద్రంలో జరిగే పోటీల్లో తలపడతాయన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, డీఈవో కె.వెంకటేశ్వరరావు, సెట్ శ్రీ సీఈవో బీవీ ప్రసాదరావు, జిల్లా పర్యాటకాధికారి ఎస్.నారాయణరావు, ఎన్‌వైకే యూత్ ఆఫీసర్ కె.వెంకట్ ఉజ్వల్, ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు సుందరరావు మాస్టారు, సాంబమూర్తి, స్కూల్ గేమ్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి రమణ, నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ ఉజ్వల్ తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ సర్వీస్ చేస్తూ పోటీలను ప్రారంభిస్తున్న కృష్ణదాస్



బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జేసీ ఎం.నవీన్



హోరాహోరీగా వాలీబాల్ పోరు

తొలిరోజు పోటీలు ఇలా..

తొలిరోజు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ క్రీడాంశాల్లో మాత్రమే పోటీలు నిర్వహించారు. ఆద్యంతం హోరాహోరిగా సాగిన ఈ క్రీడాంశాల్లో పోటీలు గురువారంతో ముగుస్తాయి. మహిళల వాలీబాల్ పోటీల్లో పలాస, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గాలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. 2వ తేదీ నుంచి ఖోఖో, బాడ్మింటన్ క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయని డీఎస్‌డీవో తెలిపారు.

విశ్వశాంతికి యజ్ఞం అవసరం



యజ్ఞశాల వద్ద జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

ఇచ్ఛాపురం రూరల్: విశ్వశాంతికి సుదర్శన యజ్ఞం ఎంతో అవసరమని జెడ్పీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ అన్నారు. తేలుకుంచి గ్రామంలో జరుగుతున్న సుదర్శన హవనాన్ని బుధవారం దర్శించుకున్నారు. అనంతరం చిన్నజీయర్ స్వామి ఆశీర్వాదం తీసుకున్నారు.

సెబ్ ఎస్ఈగా తిరుపతినాయుడు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) సూపరింటెండెంట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్ (ఎస్ఈ)గా సీహెచ్ తిరుపతినాయుడు బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి ఎస్పీ జి.ఆర్.రాధికను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తిరుపతినాయుడు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించి సాధారణ బదిలీల్లో భాగంగా ఎచ్చెర్లలోని జిల్లా సెబ్ కార్యాలయానికి వచ్చారు. ఇదివరకు పనిచేసిన సెబ్ అదనపు ఎస్పీ చందోలు విజయనాగమణికంఠ విశాఖకు బదిలీ అయ్యారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు మణికంఠ, తిప్పేస్వామి, విఠలేశ్వరరావు పాల్గొన్నారు.



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న తిరుపతినాయుడు

కారు ఢీకొని వ్యక్తి మృతి



క్షతగాత్రులకు సపర్యలు చేస్తున్న స్థానికులు

నందిగాం: మండలంలోని పెద్దబాణాపురం సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మెళియాపుట్టి మండలం జెర్రిభద్ర గ్రామానికి చెందిన వంజంగి గణపతి (51) మృతి చెందాడు. కొర్ల జనార్ధనరావు గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గణపతి తన స్నేహితుడు జనార్ధనరావుతో కలిసి ద్విచక్రవాహనంపై బెండిగేటు వెళ్లారు. అక్కడి నుంచి టెక్కలి వెళ్తుండగా పెద్దబాణాపురం సమీపానికి వచ్చేసరికి టెక్కలి నుంచి పలాస వైపు వెళ్తున్న కారు అధిక వేగంతో అదుపుతప్పి డివైడర్‌ను దాటి అవతలి రోడ్డుపై వెళ్తున్న గణపతి బైక్‌ను ఢీకొని బోల్తాపడింది. కారులో ఉన్న నలుగురు తుళ్లిపడి చిన్న చిన్న గాయాలపాలయ్యారు. బైక్‌పై ఉన్న గణపతికి తీవ్ర గాయాలు కాగా వెనుక ఉన్న జనార్దనరావు చేయి విరిగిపోయింది. క్షతగాత్రులను పలాస ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా గణపతి మృతి చెందాడు. జనార్ధనరావును మెరుగైన చికిత్స కోసం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. గణపతి భార్య ఆమని ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం హెచ్‌సీ ఢిల్లేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలో 40 కుటుంబాల చేరిక



పార్టీలో చేరిన వారితో దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి : మండలంలోని లింగాలవలస పంచాయతీ సన్యాసిపేటకు చెందిన 40 టీడీపీ కుటుంబాలు బుధవారం టెక్కలి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. ఇటీవల తమ కుటుంబాలకు చెందిన ఓటు లేని వ్యక్తులు అచ్చెన్నాయుడు సమక్షంలో టీడీపీలోకి చేరినట్లు కొన్ని పత్రికల్లో వచ్చాయని, అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో తమ కుటుంబాలకు ఎంతో లబ్ధి కలగడంతో వైఎస్సార్‌సీపీలోకి చేరామని వారంతా పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్.శ్రీరామ్మూర్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన యువకుడు మృతి

నందిగాం: మండలంలోని మద్దిలోడిపేట జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నందిగాంకు చెందిన నక్క బాలకృష్ణ (38) బుధవారం ఉదయం మృతి చెందాడు. గ్రామానికి చెందిన నక్క కామయ్య, కృష్ణమ్మ చిన్న కుమారుడైన బాలకృష్ణ స్థానికంగా వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. మంగళవారం మద్దిలివానిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తల వెనుకభాగాన తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్‌లో టెక్కలి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. మృతదేహానికి శ్రీకాకుళం రిమ్స్‌లో పోస్టుమార్టం చేసి కుటుంబసభ్యులకు అందజేశారు. బాలకృష్ణకు భార్య విజయలక్ష్మీ, ఇద్దరు కుమారులు చిద్విలాష్(6), కౌశిక్(4) ఉన్నారు. నందిగాం ఎస్సై మహమ్మద్ అమీర్‌ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు నలుగురు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా నుంచి జాతీయస్థాయి జూనియర్స్ బాలబాలికల కబడ్డీ పోటీలకు రికార్డు స్థాయిలో నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో ఎస్.హర్షిత, తామాడ లిస్సా (పలాస), కె.శ్రావణి (రణస్థలం), బాలురు విభాగంలో ఎస్.మణికుమార్(పాలకొండ) ఎంపికయ్యారు. ఫిబ్రవరి 1 నుంచి 4 వరకు తెలంగాణాలో జరగనున్న జాతీయ జూనియర్స్ పోటీలకు వీరు నలుగురు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ జట్ల తరపున వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. అంతకు ముందు వీరు నంద్యాలలో జరిగిన 49వ ఏపీ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ఆటతీరుతో రాణించడంతో జాతీయ పోటీలకు ఎంపికైనట్టు జిల్లా కార్యదర్శి సాధు శ్రీనివాసరావు తెలిపారు. వీరి ఎంపిక పట్ల జిల్లా కబడ్డీ సంఘ చైర్మన్ డాక్టర సీదిరి అప్పలరాజు, అధ్యక్షుడు ధర్మాన రామలింగంనాయుడు, సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తంచేశారు.

మెరుగైన సేవలే లక్ష్యం



సిబ్బందితో సమీక్షిస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని అన్నారు. ఇంజినీరింగ్ బ్లాక్‌లోని పాలక మండలి సమావేశ మందిరంలో బుధవారం రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందితో వీసీ సమీక్ష నిర్వహించారు. బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలని, ఫైళ్ల నిర్వహణలో జాప్యం వహించవద్దని సూచించారు. పారదర్శకంగా సేవలందించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తనను సంప్రదించవచ్చన్నారు. అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ విభాగాల సమష్టిగా పనిచేస్తే వర్సిటీ ప్రగతి పథంలో పయనిస్తుందన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య పాల్గొన్నారు.